ఒకరిద్దరుచాలు

'ఎందుకో నాకు మనస్కరించడంలేదు' అని తనలో తాను అనుకున్నది - సునీత.

అప్పుడే హైదరాబాద్ నుంచి వచ్చాడు ప్రభు. అతను తండ్రికి చెప్తున్నదంతా శ్రద్ధగా విన్నది సునీత.

మనసంతా కలచినట్లయిందామెకు.

'నాకు మనస్కరించడంలేదు'. ఈసారి పైకే అన్నాననుకున్నది కానీ, ఆ మాట పెదవిదాటి బయటికి రాలేదు.

సునీతకు సన్నగా నవ్వొచ్చింది.

ఇంత చిన్న వాక్యాన్ని తను ఎందుకు చెప్పలేకపోతోంది. చిత్రంగా వుంది. విశ్వవిద్యాలయ వక్తృత్వ పోటీలో మొదటి బహుమతి గ్రహీత! అవును తన వాగ్ధాటికి అంతకు ముందు కూడా చాలా బహుమతులు తెచ్చుకుంది.

నిజానికి అమ్మ పోకముందు ఆమె 'వసపోసిన పిట్ట' అని చాలా తరచుగా తనను అంటూ వుండేది.

మరి ఇప్పుడెందుకని ఇలా అయిపోతున్నది?

శ్యామల అంటూ వుండేది, "సునీత ముందు మనమంతా మూగవాళ్ళమే" అని. తమ జట్టులో తాను పరమ పెంకి అనీ, మనసులో మాటని ఫెళ్ళున పైకి అనేస్తుందనీ తనకు పేరు.

అలాంటిది ఇప్పుడు తన మనసులోని మాటను తనకు ఇష్టం కాని విషయాన్ని గురించి పైకి అనలేకపోతుందేమిటి?

తెలియకుండానే సిగ్గుపడింది, సునీత.

కొంగు కొసని తీసుకుని వేలికి చుట్టుకుంది. చుట్టూ చూసింది.

నూతి చప్టా మీద ఆరపోసిన మినుములు దగ్గర పిచ్చుకలు కిచకిచలాడుతున్నై. సన్నగా గాలి వీస్తోంది. పెరటిమూలగా వున్న వేపచెట్టుపై కాకి వొకటి వుండుండి కూస్తోంది.

పక్కనేవున్న బెత్తంతో పిచ్చుకల్ని అదిలించింది సునీత. అవి ఎగిరిపోయినై.

మళ్ళీ ఆలోచనలో పడింది.

అసలు మొదట్లోనే తాను సందేహించింది – అవతల మనుషులు బాగా భేషజం, అతిశయం ఉన్నవాళ్ళని వరుడి తండ్రిని గురించి విన్నప్పుడే తనకు అలా అనిపించింది.

ప్రభు తండ్రికి చెప్పిన మాటల్ని నెమరువేసుకుంది సునీత. "నా కేమిటి మాష్టారూ మాకున్నది ఇద్దరు కొడుకులు, ఒక్క ఆడపిల్ల. మగపిల్లల మీద నాలుగు లక్షలు తీసుకుంటాను. కావాలంటే రెండు లక్షలు ఆడపిల్లకి ఖర్చుచేస్తాను. నా కొడుకులు రత్నాల్లాంటివాళ్ళు. ఒకడు ఎమ్.టెక్, ఇంకొకడు డాక్టర్. న్యాయానికి.. కో అంటే కోటిమంది నా వాకిలి ముందు మూటలు పుచ్చుక్కూర్చున్నారు. నేను తల పంకిస్తే చాలు ఎగరేసుకుపోవాలని చూస్తున్నారు. మీకు తెలుసు కదా! అసలిదంతా ఎందుకు? మా ఆస్తీ అంతస్తూ సంగతేమిటి? ఏదో మీ సంబంధం నాకు మరీ కావలసిన మిత్రుడు చెప్పాడు కదా అని ఆలోచిద్దామగటున్నాను ..." అన్నాడట.

ఇదీ ఆయన వరస. ఆయన మాటల ధోరణిని గురించి తెలుసుకున్నప్పుడు వాళ్ళని గురించిన తన వూహ నిజమేనని తేల్చుకుంది, సునీత.

"సునీతా –" ప్రభు పిల్చాడు.

లేచి లోపలికొచ్చింది.

"నాకు నీళ్ళు తోడమ్మా" అంటూ, "వాళ్ళ చూపు ఆకాశంలో వుంది. చూదాలి ఏమౌతుందో" అన్నాడు – తండ్రి కేసి చూస్తూ. ఆ వివరణ తనను వుద్దేశించే చెప్పాడని ఇట్టే గ్రహించింది సునీత.

ఆ ఆదివారంనాడు పెళ్ళిచూపులు ...

రంగనాథం, చంద్రమతి, భారతి, రాజు, శివరావ్ వచ్చారు. రాజు వరుడు. భారతి అతని చెల్లెలు. శివరావ్ అతని తమ్ముడు. తల్లిదండ్రులతో కలిసి అంతా వచ్చారు.

పరిచయాల తర్వాత టిఫిన్, కాఫీలు అయినై.

శ్యామలే ఏర్పాట్లన్నింటికీ ఆధ్వర్యం వహించింది. తాను మధ్యమధ్యలో కల్పించుకుని ఆ పనీ, ఈ పనీ చేయబోతే - "నీ పెళ్ళికి నువ్వే పౌరోహిత్యం చేయకూడదే అమ్మడూ, కావాలంటే నా పెళ్ళిచూపులప్పుడు బదులు తీర్చుకో" అంటూ ఫెళ్ళున నవ్వేసింది.

తన మనస్సు చివుక్కుమంది. ఇద్దరూ తల్లిలేని పిల్లలే. కళ్ళలో నీళ్ళు తిరిగినై. శ్యామల చూసింది. బుజం మీద తట్టి, "పిచ్చి మొద్దూ - మన అందర్లో మహా ధైర్యవంతురాలివనే పేరు కొట్టేశావ్ గానీ, వఠి మేకపోతు గాంభీర్యమే అన్నమాట. వూరుకో" అని ఆప్యాయంగా అంది.

శ్యామలా, సునీతా హాల్లోకొచ్చి కూర్చున్నారు.

నెమ్మదిగా తలెత్తి పెళ్ళివారి వైపు చూసింది సునీత.

చంద్రమతి చాలా ఆడంబరంగా వుంది. మెళ్ళో నాలుగు పేటల చంద్రహారం కంటె, చేతికి వంకీలు, నడుముకు వడ్డాణం, చెవులకు రవ్వల దిద్దులు, చేతులకు ఆరు జతల బంగారు గాజులు, కట్టిన పట్టుచీర మూడు వేల రూపాయల విలువ చేస్తుంది. భారతి వంటిమీద చాలా జవ్వారీ వుంది. పాపిట చేరు, చెవులకి పెద్ద పెద్ద రింగులూ, మెళ్ళో నెక్లెసూ, రెండు పేటల బొట్ల గొలుసూ, కుడిచేతికి నాలుగు బంగారు గాజులూ, ఎడమచేతికి క్వార్ట్జ్ వాచీ.

సునీత కాలేజీ చదువు గురించీ, ఆమె తెలివితేటల్ని గురించీ, ఎమ్మే వరకు ఫస్ట్‌క్లాస్‌లో పాస్ కావడం మొదలైన విషయాలు వాళ్ళతో చెప్తూ కూర్చున్నాడు ప్రభు.

కొద్దిసేపటి తర్వాత రంగనాథం అన్నాడు "ధర్మారావుగారూ ... మాకు

ఇంకా రెండుమూడు ఆఫర్లు వున్నై. అవి కూడా చూసిన తర్వాత మీకు కబురు చేస్తాను".

తండ్రి తలవూపేడు గానీ, సునీతకి మనస్సు కలుక్కుమంది.

సునీత కేసి మరోమారు నిశితంగా చూసి ముందుకు నడిచేడు రాజు. వాళ్ళు వెళ్ళిపోయారు.

"ఏమంటావోయ్" అని పరిహాసంగా అడిగింది శ్యామల.

సునీత సన్నగా నవ్వి వూరుకుంది.

"ఎందుకనో నాకు మనస్కరించడం లేదు" అని తనలో తాను మాత్రం అనుకుంది. కానీ, పైకి అనలేకపోయింది.

రాత్రి - ఆరుబయట మంచం మీద పడుకుని వుంది సునీత. నల్లని ఆకాశాన్ని, తెల్లని నక్షత్రాల్నీ చూస్తోంది. చల్లని గాలి విరజాజి పందిరి మీంచి పరిమళాల్ని మోసుకొస్తోంది.

తండ్రీ, అన్నా పక్కన మంచాల మీద పడుకుని ఈ సంగతులే ముచ్చటించుకుంటున్నారు.

ప్రభు అంటున్నాడు, "పిల్లవాడు మంచివాడనీ, మంచి ఉద్యోగమనీ చూస్తున్నాం కదా. వాళ్ళ నిర్ణయం రానీయండి, ఆలోచిద్దాం".

సునీత ఆలోచనలో పడింది. వాళ్ళ నిర్ణయం ఎలా వుంటుంది? ఎలావున్నా సరే తన మనసులో మాట చెప్పేస్తే ? - ఈ సంబంధం అన్ని విధాలా మంచిదని చాలా కష్టపడి వాళ్ళని, వొప్పించి, పెళ్ళిచూపులు ఏర్పాటు చేయించారు. ఈ దశలో తాను అభ్యంతరం చెప్తే ... నాన్నా, అన్నయ్యా బాధపడతారు. తన పెళ్ళి గురించి చాలా అవస్థ పడుతున్నారు.

వారం గడిచింది.

రంగనాథం నుంచీ వుత్తరం వచ్చింది. తాను చదివి కొడుక్కి ఇచ్చాడు ధర్మారావు. ప్రభు కూడా చదివేడు. "రేపే వెళ్ళి మాట్లాడివద్దాం" అంటూ వుత్తరాన్ని

పక్కనే వున్న చెల్లెలి చేతికిచ్చాడు.

సునీత చదువుకుంది.

"మేము చూసిన సంబంధాల్లో ఆస్తీ అంతస్తుల దృష్ట్యా మిగిలినవన్నీ మీ కంటే ఎంతో మిన్నగా వున్నై. అయినా పిల్ల ఎత్తరిగా వుండాలని మా అబ్బాయి కోరిక దృష్ట్యా మీ పిల్ల నచ్చింది. మీరిక్కడికి వచ్చి మిగిలిన విషయాలు మాట్లాడుకోవలసినది".

'పెద్ద హిపోక్రట్‌లా వున్నాడు' కోపం వచ్చింది సునీతకి.

ఇప్పుడన్నా తన మనసులో మాటని తండ్రికీ, అన్నకీ చెప్పాలని అనుకున్నది గానీ చెప్పలేదు.

తనలో తానే అనుకున్నది - "ఎందుకనో నాకు మనస్కరించడం లేదు".

మర్నాడు - హైదరాబాదు వెళ్ళారు ధర్మారావూ, ప్రభూ.

వాళ్ళిద్దరూ వూళ్ళో లేనప్పుడు శ్యామల సునీతకు తోడుగా వున్నది.

మూడోరోజు ఉదయం అన్నా, తండ్రీ తిరిగొచ్చారు. వాళ్ళిద్దరి ముఖకవళికల్ని గమనించి వెళ్ళినపని ఏమైందని ధైర్యం చేసి అడగలేకపోయింది సునీత.

వాతావరణం గంభీరంగా వుంది. ఎవరి పనుల్లో వారు వున్నారు. ధర్మారావు వాలుకుర్చీలో పడుకుని దినపత్రికని తిరగేస్తున్నాడు. ప్రభు ఆఫీసుకు పోవడానికి తయారౌతున్నాడు.

టిఫిన్ సిద్ధం చేసి పిలిచింది సునీత.

నలుగురూ డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నారు.

"నెక్ట్స్ ప్రోగ్రాం ఏమిటి?" వాతావరణాన్ని ఈజ్ చేయాలనే వుద్దేశ్యంతో తన సహజ హాస్య ధోరణిలో అడిగింది శ్యామల.

శ్యామల కళ్ళల్లోకి చూస్తూ "కాసీ తాగడం" అన్నాడు ప్రభు. తలెత్తి

కూతురి కేసి చూశాడు ధర్మారావు.

శ్యామల, సునీత సన్నగా నవ్వుకున్నారు. తండ్రి ఏదో చెప్పబోయేలోగా ప్రభు అన్నాడు, "మంచిరోజు చూసి తాంబూలాలు పుచ్చుకోవడానికి వస్తారు వాళ్ళు".

"నేను కొంచెం వెనకాముందూ ఆలోచించుకుందామని ఆగమన్నాను. కానీ మీ అన్నయ్య వాళ్ళడిగిన కట్నానికి వొప్పేసుకుని వచ్చాడు. ఎక్కణ్ణుంచి తెస్తామో ఏమో" కూతుర్ని ఉద్దేశించి అన్నాడు ధర్మారావు.

శ్యామల, సునీత వొకరి మొహాలొకరు చూసుకున్నారు. శ్యామల కళ్ళు చికిలించి సన్నగా ఈల వేసింది. సునీత తల వంచుకుంది.

క్షణాల తర్వాత అన్నాడు ధర్మారావు "లక్షకి రూపాయి తక్కువైనా కుదరదన్నారు వాళ్ళు".

"లక్ష...!" శ్యామలా, సునీత ఇద్దరూ తమలో తాము గొణుక్కున్నట్టుగా అన్నారు.

"తప్పదు మరి. మార్కెట్లో రేట్లు ఇంకా మండిపోతున్నై. రంగనాథం గారు అన్నట్టు ఇది చాలా చౌక బేరమే" అని చెల్లెలి కేసి చూశాడు ప్రభు. ఆమె చూపుల్లో చాలా ప్రశ్నలు చదువుకున్నాడు.

తలవంచుకుని చెప్పసాగేడు. "మన తాహతుకి ఇది ఎత్తలేని బరువే. పెద్ద కష్టమైన పనే. కాదనను. కానీ, పరిస్థితులు అలా వున్నై. ఎక్కడో ఒకచోట చూద్దాం. జస్ట్ ఎడ్జస్ట్‌మెంటే గదా. రేపు నేను కట్నంగా తీసుకునే డబ్బు సర్దుబాటు చేద్దామని చెప్పి నేనే వొప్పించాను నాన్నని".

సునీతా, శ్యామలా ఇద్దరూ ప్రభు మాటలకి ఆశ్చర్యపోయారు. వాళ్ళ ఆశ్చర్యానికి కారణం ప్రభుకు తెలియనిది కాదు. అందుకే అన్నాడు, "నలుగురితో బాటు నేనూ నారాయణా అనుకున్నాను. వాస్తవంతో బతక్క తప్పదు. జీవితంలో అడుగడుగునా రాజీపడక తప్పదు మరి. ఇక్కడి కీ బాధ్యత తీరుతుంది".

అందరూ మౌనం వహించారు. యాంత్రికంగా కాఫీలు ముగించారు.

మరో గంటకి శ్యామల వెళ్ళిపోయింది.

పన్నెండున్నరయింది.

పనులు పూర్తి చేసుకుని తన గదిలో పడుకుని దినపత్రిక చూడసాగింది సునీత. బాక్స్ కట్టి తాటికాయంత అక్షరాల్లో వార్త - "వరకట్నానికి మరో అబల బలి".

సునీత మేధస్సుని ఆలోచనలు ముసురుకున్నై. పత్రికని పక్కన పడేసింది.

తన ఆదర్శాలూ, ఆశయాలూ, ఆచరణా అన్నీ వొక్కసారిగా గుర్తుకొచ్చినై ఆమెకు. అంతర్విశ్వవిద్యాలయ వక్తృత్వ పోటీల్లో తన ఉపన్యాసం గుర్తుకొచ్చింది. అక్కడ అదే విషయం మీద పోటీ జరిగింది. వరకట్నం గురించిన సమస్త వివరాలూ తనకు క్షుణ్ణంగా తెలుసు. సాంఘికంగా, నైతికంగా, చట్టపరంగా ఈ దురాచారంలోని లోపాల్ని తను తూర్పార పట్టింది. వ్యవస్థలో మార్పు రావాలన్నది. వ్యక్తిలో మార్పు రావాలన్నది. అందుకు అనుగుణంగా యువతీ యువకులు ఆదర్శాన్ని ఆచరణలో పెట్టాలన్నది.

కాలేజీలో పదిమంది ముందూ తన వాదనని వినిపించింది. మిత్రబృందంతో చర్చించింది. పెద్దల్ని కొంటె ప్రశ్నలు వేసి అనేక సందర్భాల్లో ఇరకాటాన పడేసింది.

కానీ, ఈనాడు తాను చేస్తున్నది ఏమిటి? తాను మాత్రమే కాదు. తన వలన ప్రభు కూడా అతని ఆదర్శాన్ని గాలికిపోయిన పేలపిండిలా మార్చేసుకుంటున్నాడు. ఏమిటీ విషవలయం? - ఇదంతా ఎందుకిట్లా జరగాలి? దీనికి తానూ తలవొగ్గవలసిందేనా? కాదు - తను 'ఎందుకనో నాకు మనస్కరించడం లేదు' అని తన మనసులోని మాటను చెప్పేయాలి.

తలుపు తట్టిన శబ్దానికి ఉలిక్కిపడి లేచింది సునీత.

ప్రభు లంచ్‌కి వచ్చాడు. సునీత ఆలోచనల్లోంచి తేరుకుంది.

ఆ సాయంత్రం శ్యామల దగ్గరికి వెళ్ళింది సునీత. తాను అనుభవిస్తున్న

మానసిక సంఘర్షణని ఆమెకి చెప్పింది. ఇద్దరూ తమ అభిప్రాయాల్ని కలబోసుకున్నారు.

చివరికి అన్నది శ్యామల, "మీ అన్నయ్య చెప్పాడు గదా. వాస్తవంలో బతక్క తప్పదు. జీవితంలో అడుగడుగునా రాజీ పడక తప్పదు మరి. మనకేమీ నెత్తిన కొమ్ములు మొలవలేదు గదా కానీయ్ ... ఏం చేస్తాం."

తాంబూలాలకు కూర్చున్నప్పుడు మరోసారి ప్రయత్నించింది సునీత - "ఎందుకనో నాకు మనస్కరించడం లేదు" అని తన మనసులో మాట చెప్పాలని. కానీ, ఆడతనం అడ్డొచ్చి చెప్పలేకపోయింది.

ఆ తర్వాత అన్ని పనూలూ త్వరత్వరగా జరగిపోయినై.

పెళ్ళి కూడా ఆడంబరంగానే జరిగింది.

తమ అంతస్తుకి తగినట్టుగా సకల మర్యాదలూ జరిగినందుకు రంగనాథం గారి కుటుంబం తృప్తి పడింది.

ఆ రోజు -

తొలిరేయి ...

ఉద్విగ్నమైన మనస్సుతో గదిలోకి ప్రవేశించింది సునీత.

రూపలావణ్యంలో ముగ్ధమనోహరంగా వున్న భార్య చేయందుకుని పాన్పు దగ్గరికి నడిపించేదూ - రాజు.

మంచం మీద కూర్చుంది సునీత.

ఆమె చుబుకాన్నెత్తి ముఖాన్ని తన వైపు తిప్పుకున్నాడు రాజు. ఆమె కనుకొలకుల్లో నీళ్ళు.

రాజు విచలితుడైనాడు.

"ఎందుకనో నాకు మనస్కరించడం లేదు" అంటూ ఠక్కున మంచం మీద నుంచి దిగి పక్కగా నిలబడింది సునీత.

ఉరుము వురిమిందో పిడుగు పడిందో తెలిలేదు రాజుకి. క్షణంలో సగం సేపు గాలి స్తంభించినట్లయింది. మరుక్షణం తనను తాను సంబాళించుకున్నాడు. బుద్ధి పనిచేసింది. నెమ్మదిగా కదిలేడు.

సునీత వెనగ్గా నిలబడి ఆమె నడుము మీద చెయివేసి పొదివి పట్టుకున్నాడు.

ఆమెలో నిరసన అలవోకగా కదిలింది.

ఆమె కళ్ళముందు తన షర్టు జేబులో నుంచీ తీసిన కాగితాన్ని రెపరెపలాడించాడు రాజు.

కళ్ళు విచ్చుకుని చూసింది సునీత. తన పేరున లక్ష రూపాయల డ్రాఫ్టు!

ఆశ్చర్యం, ఆనందం కలిసి తబ్బిబ్బు చేసినై ఆమెను.

"ఆకారంలోనే కాదు, ఆదర్శంలో కూడా ఉన్నతమైన దానివని తెలుసుకున్నాను. నూరేళ్ళ జీవితంలో నీకు మనస్కరించని పనిని చెయ్యడం నాకూ మనస్కరించదు. అందుకని మన అందరి వ్రతమూ చెడినట్లు అనిపించినా, ఫలం దక్కేటట్లు చేశాను" అని. "అవును" అన్నట్లు కళ్ళు చికిలించాడు రాజు.

"థాంక్స్" అని ఇంకా ఏదో అనబోయింది సునీత.

"అవన్నీ మీ కాబోయే వదిన - అదే మీ శ్యామలకి. నాదీ వో బండి కంకర" అని నవ్వేశాడు రాజు.

ఆశయ సాఫల్యం, అనురాగరాగాన్ని అమృతమయం చేసింది.

ఆ తర్వాత అక్కడ అంతా పూలజల్లు!!!

....

(యువ ఏప్రిల్ 1986)